

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

సోమవారం,29 డిశంబర్ 2025

8 పేజీలు


### అభివృద్ధిలో పీఎం లంక

# టాప్‌లో ఉండాలి

- ఆంధ్ర కోడలుగా ,పెదమైనవానిలంక కూతురిగా సుపరిచితమే
- గ్రామాన్ని నేను దత్తత తీసుకోవడం కాదు - ప్రజలే నన్ను దత్తత తీసుకున్నారు
- కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్







**నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్:** కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్ జిల్లా పర్యటన సందర్భంగా ఆదివారం పెదమైనవానిలంక గ్రామంలో డిజిటల్ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కేంద్ర ఆర్థికమంత్రితో పాటు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్,రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డా.నిమ్మలరామానాయుడు, జిల్లాకలెక్టరుచదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి,శాసనసభ్యులు, ప్రభుత్వ విఫ్ బొమ్మిడి నాయకర్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ,తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ,తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే,ప్రభుత్వ విఫ్ బొలిశెట్టి శ్రీనివాస్,ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు,ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు,కూటమి నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంశా పత్రాలు,మెమొంటోలు కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అందజేసి,అభినందించారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ పిఎం లంకగ్రామం అభివృద్ధి గ్రామమహిళల మద్దతుతోనే సాధ్యమైంది అన్నారు. ఆంధ్ర కోడలు పెదమైనవానలంక కూతురిగా ఇక్కడవారికి ఎప్పుడు సుపరిచితమే నన్నారు.పీఎం లంకలో నిర్మించిన సైక్లోన్ భవనం అన్నివిధాలుగా ఉపయోగపడడం సంతోషకరమన్నారు. పియం లంక మహిళల

- తరువాయి 2లో..

## ప్రధాని మోడీ నోట నరసాపురం లేసు అల్లికల మాట



**నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** మన్ కీ బాత్ 129వ ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నరసాపురం లేస్ పరిశ్రమ, లేస్ పని చేసే మహిళల గురించి గర్వంగా ప్రస్తావించడం మన జిల్లాకు ఎంతో గర్వకారణం.భారత ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగంలో నరసాపురం మహిళలు తమ చేతివృత్తి ద్వారాతయారుచేసే లేస్ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది లోకల్ ఫర్‌వోకల్ అనేనినాదానికి ఒకచక్కనిఉదాహరణ అని కొనియాడారు. 250 గ్రామాలలో లక్షలాది మంది గ్రామీణ మహిళలు ఈకళ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ,ఆర్థికంగా ఎదగడం పట్ల ప్రధాని ప్రశంసలు కురిపించారు. మహిళలు ఇలాంటి పురాతన కళలను కాపాడుకుంటూ వృత్తిలో రాణించడం దేశానికి గర్వకారణమని చెప్పారు. ఇక్కడ తయారైన 500రకాల క్రోచెట్ లేస్ ఉత్పత్తులు విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయని, ఇది భారతీయ సంస్కృతి, నైపుణ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తోందని ప్రధాని పేర్కొన్నారు. నరసాపురం లేస్

- తరువాయి 2లో..

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

- 10 కేజీల గంజాయి,మోటార్ సైకిల్ సీజ్
- డి.ఎస్.పి ఎం.వెంకటేశ్వరరావు వెల్లడి





**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** మోటార్ సైకిల్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశామని పోలవరం డిఎస్పి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారుఆదివారం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో జీలుగుమిల్లిలోని జాతీయ రహదారి 516డి పై వాహనాలు తనిఖీలు చేస్తుండగా మోటార్ సైకిల్ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా ఉండడంతో ఎస్సై క్రాంతి కుమార్, సిబ్బంది మోటార్ సైకిల్ ను పరిశీలించేందుకు ప్రయత్నించగా వారు తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించారని తెలిపారు. అయితే మోటార్ సైకిల్‌కు ఉన్న సీటు ఎత్తుగా

- తరువాయి 2లో..

## కో అంటే కోడి - సై సై అంటే కోట్లు?

- కోళ్లను ఈత కొట్టించడం - మనుషుల కంటే ఎక్కువ సపర్యలు
- బలవర్ధకమైన ఆహారం పెట్టడం షరా మామూలే !









**ఏలూరు, ఉమ్మడి ప.గో.జిల్లా బ్యూరో :** సంక్రాంతి పండుగ వస్తుందంటే కో అంటే కోడి, సై అంటే కోటి అనిపించేలా కోడి పందాల సంబరాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణ, తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాలలో నిర్వహిస్తారని దేశం నలుమూలలతో పాటు ఇతర దేశాలలో కూడా జగమెరిగిన విషయమే. గత ఏడాది తాడేపల్లిగూడెం సమీపంలో ఒక బరిలో అక్షరాల 1 కోటి రూపాయల పందెం నిర్వహించడమే దీనికి తార్కాణం అని చెప్పుకోవాలి. సంక్రాంతి సమయంలో జరిగే కోడిపందాల బరులలో అత్యల్పంగా 2 లక్షల నుండి అధికంగా 20 లక్షల వరకు ఒప్పంద పందాలు జరుగుతూ ఉంటాయి. కానీ దీనికి భిన్నంగా గత ఏడాది 50లక్షలు, కోటి రూపాయలు పందాలు కూడా జరిగాయంటే కోడిపందాల పట్ల ఈ ప్రాంత ప్రజలకు ఉన్న క్రేజ్ ఎటువంటిదో చెప్పకనే చెప్పవచ్చు. అరగంటలో ఫలితం తేలే ఇటువంటి కోడిపందాలు బరులలో ఈ విధంగా ఒప్పంద పందాలు జరిగితే బరి బయట అంతకు రెట్టింపు పందాలు జరుగుతాయనేది వాస్తవంగా చెప్పుకోవచ్చు. ఇటువంటి కోడిపందాలకు ఈ జిల్లాల్లో ఇప్పటికే బరులు సిద్ధం అవుతున్నాయి. ఇతర ప్రాంతాలనుండి

- తరువాయి 2లో..

# అభివృద్ధిలో పీఎం లంక టాప్‌లో ఉండాలి

మొదటిపేజి తరువాయి

మద్దతు వల్లే సైక్లోన్ భవనం డిజిటల్ భవనంగా మారిందని, డ్రోన్లు నడిపేవారు ఉన్నారన్నారు. కానీ వాటిని ఎలా తయారు చేయాలి,మరమత్తు వస్తే ఏం చేయాలి అసలు డ్రోన్ అంటే ఏంటి ఎలా ఉపయోగించాలి దానిపై ఆంధ్రాలో మొట్ట మొదటిసారిగా పిఎంలంకలో శిక్షణ ఇవ్వడం జరుగుతోందని అన్నారు.శిక్షణ పొందిన యువత దేశ విదేశాల్లో మంచి స్థానంలో ఉన్నారని , వారంతా తమ అభిప్రాయాలను పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విశ్వకర్మ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ జరిగిందని, శిక్షణ ఎలా ఉంది, ఎలా జరిగింది అని దేశవ్యాప్తంగా సర్వే చేయగా జమ్మూ కాశ్మీర్ మొదటి స్థానంలో ఉండగా రెండో స్థానంలో పిఎం లంక ఉండడం ఎంతో ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. రైతులు,మహిళలు డ్రోన్లు వినియోగించే స్థాయికి చేరుకోవాలన్నారు. పదేళ్ల కిందట ఇదే ప్రాంతంలో పెద్ద కొబ్బరి తోట ఉండేదని, అది సముద్రపు అలల కోతకు సముద్రంలో కలిసి పోయిందన్నారు. అలల తాకిడిని ఆపేందుకు అధునాతన టెక్నాలజీతో అడ్డుకట్ట నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. పదేళ్ల తర్వాత ఇక్కడ ఎంతో మార్పు వచ్చిందని సైక్లోన్ వస్తే ఈ ప్రాంతాన్ని ఎలా రక్షించాలని ఆలోచన నుంచి ఏఐ శిక్షణ వరకు అభివృద్ధి చెందిందన్నారు. పీఎం లంక వాసులకు పీఎం ఆవాస్ యోజన కింద 146 మందికి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని, అవి రాబోయే 12 నెలలలో పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మత్స్యకారులకు బోట్లు అందించేందుకు ధరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అవి కూడా ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ సూచించారు.కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ దేశ ప్రగతికి, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ క్రియాశీలక పాత్ర నిర్వహిస్తున్నాం న్నారు. 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ నాలుగో స్థానానికి తీసుకురావడంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక మంత్రిగా తీసుకున్న సంస్కరణలతో సాధ్యమైందన్నారు.పీఎం లంక,తూర్పు తాళ్ల గ్రామాలలో ఇంటింటా మరుగుదొడ్లు,స్కూలు భవనాల నిర్మాణాలు,వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పీఎం లంక సముద్రపు కోతకు గురి కాకుండా రక్షణ గోడకు 13.50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం త్వరలో పూర్తికానున్నట్లు తెలిపారు.రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పీఎం లంక గ్రామానికే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా రక్షణగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డా.నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ భారతదేశ ఉపఖండంలో శక్తివంతమైన వ్యక్తి, ప్రపంచ వ్యాప్తంగా భారతదేశాన్నికీ గుర్తింపు తెచ్చిన ఏకైక ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.నేను చదువుకున్న రోజుల్లో అభివృద్ధి చెందుతున్న భారతదేశంగా చుదువు కున్నామని, నేటి యువత అభివృద్ధి చెందిన భారతదేశంగా చదువుకునే అవకాశం ఎన్డీఏ ప్రభుత్వం తీర్చిందని అన్నారు. జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో తీర ప్రాంతంలో ఏకైక దత్తత గ్రామం పెదమైనవానిలంక అన్నారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ తీరప్రాంతం అభివృద్ధికి, పకృతి వైపరీత్యాలు సమయంలో సముద్రపు రక్షణ కవచం, డిజిటల్ భవనంతో నిర్మలా సీతారామన్ తీరప్రాంతాన్నికి తల్లి అయ్యిందని అన్నారు. జిల్లాలో చివరి ప్రాంతం,తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ప్రపంచపటంలో గుర్తింపు తెచ్చిన ఘనత కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ కే దక్కుతుందని అన్నారు.అనంతరం పీఎం లంక సముద్ర తీరాన సముద్రపు కోతకు గురి కాకుండా సి ఎస్ ఆర్ నిధులు రూ.13.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అడ్డుకట్ట నిర్మాణం పనులను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి స్వయంగా పరిశీలించి, ప్రాజెక్ట్ చేపట్టిన ఎలైట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలను తెలుసుకుని, పనుల నిర్మాణం ప్రజెంటేషన్ ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించారు.అంతకుముందు అక్కడే ఉన్న శివాలయాన్ని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనాలను తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి, సైయెంట్ ఎండి బి.వి.ఆర్ మోహన్ రెడ్డి,యూనియన్ బ్యాంక్ డి.ఎఫ్. ఎస్ డైరెక్టర్ వివేక్ గుప్త, ఎగ్జిమ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ దీపాలి అగర్వాల్, ఎండి, సీఈవో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆసీస్ పాండీ,నాబార్డ్ సీజీఎం ఎం.ఆర్. గోపాల్,స్టేటు బ్యాంకు ఆఫ్ ఇండియా జీఎం సైలేష్ కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం సి.బి. ఎన్.భాస్కరరావు, గేమ్స్ ఫౌండేషన్ పిడి సుభాష్, ఆర్డీవో దాసి రాజు,డియస్పి డా.జి.శ్రీవేద, ఏపి మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు,జిల్లా డిసియంయస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, నరసాపురం టీడీపీ ఇంచార్చి పొత్తూరి రామరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజ రామ్మోహన నాయుడుజిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు యం.వసంత రావు, జిల్లా బిజెపి అధ్యక్షులు అయినం పూడి శ్రీదేవి,కేంద్రమంత్రి ప్రతినిధి పేరాల మోహన్, బ్యాంకు అధికారులు, జిల్లా,డివిజన్,మండల అధికారులు, గ్రామ సర్పంచి కొల్లాటి కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

## రత్నగిరిపై నూతన వ్యాపార దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సత్య ప్రభ

**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన స్థానిక టీడీపీ నాయకులు వీర్లసూరిబాబు రత్నగిరిపై ఏర్పాటు చేసిన నూతన వ్యాపార దుకాణాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా వ్యాపారం ప్రారంభించిన సూరిబాబు & బ్రదర్స్‌కు అభినందనలు తెలిపి వారి వ్యాపారం అభివృద్ధి చెందాలని, యజమానిగా, లాభాలు గడించాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చేయూత రవి సమాజ సేవలు స్ఫూర్తిదాయకం

– కొండబాబు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగం చేసుకుంటూ గత 19 సం.రాలుగా తనకొచ్చిన జీవితంలో కొంత మొత్తాన్ని సమాజానికి ఉపయోగిస్తూ తన తోటి ఉద్యోగ ఉపాధ్యాయులందరితో కలిసి 8సం. రాల క్రితం డా. మొండి రవికుమార్ (చేయూత రవి) చేయూత సంస్థను ఏర్పాటు చేసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు ప్రతిరోజు కాకినాడ మరియు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గర్భిణీ స్త్రీలకు మరియు రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవారంగానికే కొత్త నిర్వచనం ఇచ్చారని కాకినాడ అర్బన్ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు కొనియాడారు. స్థానిక ఎన్‌జిఓ హోమ్‌లో జరిగిన కార్యక్రమంలో డా. రవిని శాశసన సభ్యులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకి రక్తదానం కార్యక్రమం తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులకి ఉచిత విద్య వైద్యం వసతి భోజన సదుపాయాలతో చిల్డ్రన్ హోమ్ ఏర్పాటు చేసి కట్టు బట్టలతో వచ్చిన వారికి ఉపాధి వచ్చేవరకు కృషి చేయడం గొప్పవిషయమని అన్నారు. అత్యవసర సమయాల్లో వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం అందించడం వినికిడి లోపంతో మూగబోతున్న చిన్నారులకి స్పీచ్ తెరఫీ ట్రైనర్లు, ఫిజియోథెరపీ మెషిన్లు భవిత సెంటర్లుకు అందించడం, దివ్యాంగులకు జీవనోపాధి కల్పించడం, ట్రై సైకిల్స్, వీల్ చైర్ అందించడం, ఆర్థికంగా వెనుకబడి ఉన్నత భవిష్యత్ కలిగిన చిన్నారులకి ఉన్నత చదువులు చదివించడం, ఇలా అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న చేయూత రవికుమార్‌ని కొండబాబు అభినందించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే ఉద్యోగుల పాత్ర కీలకమని, చేయూత రవి లాంటి ఉద్యోగులు ఉండటం కాకినాడ అదృష్టమని, ఉన్నదానిలో దానం చేయడం ఒక అలవాటుగా తను మార్చుకోవడమే కాకుండా తన పరిధిలో ఉన్నవారిని మరిము మిత్రులను భాగస్వామ్యం చేస్తూ అనేక సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నారనీ ఉద్యోగ ఉపాధ్యాయులతో పాటుగా ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారని భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్నా కూటమి ప్రభుత్వం తరుపున అండగా నిలుస్తామని రవికుమార్ సేవలకు హామీ ఇచ్చారు. శాశ్వత భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం తరుపున కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఆర్మీతో పాటు మంచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని గుర్తు చేసారు.ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షులు జి.మోహన్ రావు, కార్యదర్శి మూర్తి బాబు, మీనాక్షి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు ఆశీర్వాదం, రామానాయుడు, కృష్ణా, చేయూత ప్రధాన కార్యదర్శి అలీమ్, కోశాధికారి చింతా నారాయణ మూర్తి తదితర ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ నోట నరసాపురం లేసు అల్లికల మాట

మొదటిపేజి తరువాయి

పరిశ్రమకు ఇటీవల జిఐ ట్యాగ్‌కూడా లభించిన నేపథ్యంలో, ప్రధాని ప్రసంగంలో నరసాపురం లేస్ మహిళల కోసం ప్రస్తావించడం స్థానికలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.నరసాపురం లెస్ అభివృద్ధికి గత సంవత్సర కాలంగా పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఎంతో కృషి చేస్తున్నారు. ప్రధాని కార్యక్రమాన్ని పి యం వానిలంకలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజలు వీక్షించారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

మొదటిపేజి తరువాయి

ఉండడంతో అనుమానంతో పరిశీలించగా గంజాయి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో సీటును విడిభాగాలుగా చేయగా 10 కేజీల150 గ్రాముల బరువు గల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఒరిస్సా బోర్డర్ నుండి తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాజ్ పుత్ కమల్ సింగ్, ఆకుల వంశీకృష్ణ లపై కేసు నమోదు చేసి మోటార్ సైకిల్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకునే సీజ్ చేసినట్లు తెలిపారు. వీరి ఇద్దరిపైన కేసు నమోదు చేసి కోర్టుకి పంపనున్నట్లు వెల్లడించారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తు లను గుర్తించి పట్టు కున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ బి వెంకటేశ్వర రావు,ఎస్సై క్రాంతికుమార్ ,సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి నట్లు డిఎస్పి వెంకటేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ.బి వెంకటేశ్వర రావు, ఎస్సై వి క్రాంతికుమార్, సిబ్బంది ఉన్నారు.

## కో అంటే కోడి - సై సై అంటే కోట్లు?

మొదటిపేజి తరువాయి

వీక్షించటానికి పందాలు కాయటానికి వచ్చే అతిథులు స్నేహితులు ఉండేందుకు వారి స్థాయిలలో కాటేజీలు, రూములు ఇప్పటికే పట్టణాల్లో సిద్ధం చేశారంటే అతిశయోక్తి కాదు.ఈప్రాంతంలో జరిగే కోడిపందాలకు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, సినీ నటులు సైతం ఎంతో మక్కువతో,ముచ్చటగా, పార్టీలకు అతీతంగా హాజరవుతారంటే కోడిపందాలపై ఉన్న క్రేజ్ ఎటువం టిదో అర్థం చేసుకోవచ్చు. పందాలలో పాల్గొనే కోళ్లను ఎంతో మక్కువతో పెంచుతూ ఉంటారు అందులో భాగంగానే ప్రత్యర్థి కోడిపై సత్తా చాటి గెలుపొందడం కోసం కోళ్లకు అనేక తర్ఫీదుల ను ఇస్తారు. అందులో ముఖ్యంగా ఈత కొట్టించడం అనిచెప్పాలి. ఈత కొట్టించే ప్రక్రియలో కోళ్లను పెంచే మకాముల వద్ద చిన్నపాటి డ్రమ్ము లను ఏర్పాటు చేస్తారు ఇందులో ఉదయాన్నే కోళ్లను ఈత కొట్టి స్తారు. ఇలా ఈత కొట్టించడం ద్వారా ప్రత్యర్థి కోడిపై తన జులుం ప్రదర్శించడానికి సాలి,ఒగుర్పు, అలసిపో వటం వంటివి రాకుండా పోరాటం చేస్తుందని పందెం రాయుళ్లు పేర్కొంటున్నారు. ఈత కొట్టి అలసిపోయిన కోళ్లకు పెనంపై కాటన్ వస్త్రాలను వేడి చేసి కోళ్లకు అద్ది ఉపశమనం పొందేలా చేస్తారు. పందాలలో పాల్గొనే కోళ్లకు బలవర్ధకమైన ఆహారం ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా మటన్ కైమా, జీడిపప్పు, పిస్తా, బాదంపప్పు వంటి వాటితో లడ్డూలు తయారు చేసి కోళ్లకు దాణాగా పెడుతూ ఉంటారు. ఇలా బలవర్ధకమైన తిన్న కోడి పోట్లాటలో ముందు ఉండటమే కాకుండా అత్యంత వదులుగా ఉండే కోడి కత్తి ఘాటు కూడా కోడి శరీరంలో దిగకుండా శరీరం గట్టిపడుతుందని మకాంధారులు తెలుపుతు న్నారు. అందుకే అత్యంత ధర కలిగిన వేట మాంసం డ్రై ఫ్రూట్స్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలను నిర్దే శించిన సమయం ప్రకారం పెట్టి పోషిస్తారంటే ఆశ్చర్యపోనవసరం లేదు. కోడిపం దాలలో పాల్గొనే కోడి మకాములలో పెంచే కోళ్లకు మనుషుల కంటే ఎక్కువ సఫర్యలు చేస్తారంటే మనమంతా నమ్మి తీరాలి.

ఎందుకంటే ఈ మకాముల లోపలకు అందరికీ అనుమతులు ఇవ్వరు. అలాగే మకాము లోపలికి వాళ్లను చూడటానికి వెళ్లే వారిని సైతం పరిశుభ్రంగా ఉండేలా చూస్తారు. అలాగే ఈ కోళ్లను చిన్నపిల్లల కంటే ఎక్కువగా సాకుతా రు. ఎందుకంటే ఎటువంటి వైరస్లు దరి చేరినా అది మకాము మొత్తానికి వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది కాబట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారు. తాము పెంచిన కోడి పందెం బిరులో ప్రత్యర్థి కోడి పై గెలుపొందాలని ఉవిళ్ళూరే పందెం రాయుళ్లు పం దెం పుంజుల పెంపకానికి వెనకాడరని చెప్పాలి. కొసమెరుపు ఏమిటంటే పేరెన్నిక కలిగిన మఖాముల నుండి పెంపకం దారుల నుండి కోడి బరిలోకి దిగుతుందంటే గెలుపు ధీమా వ్యక్తం చేస్తూ లక్షల రూపాయలను పందాలలో కాస్తారు. సంక్రాంతి పండగ కోసం పందెం రాయుళ్లు ఏడాదికాలంగా ఎదురుచూస్తున్న సమయం మరి కొన్ని రోజులలో రానే వస్తుంది. కోట్ల రూపాయలు కోడిపం దాల రూపంలో చేతులు మారనున్నాయి. ఇది సాంప్రదాయ బద్దం గా,కొన్ని దశాబ్దాలుగా, ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జరుగుతున్న తంతు కావడం గమనార్హం.

# నిడమర్రులో విజిబుల్ పోలీసింగ్




**– మద్యం సేవించిన,సరైన పత్రాలు లేని వారిపై కేసులు – వాహనాలు సీజ్**

**నిడమర్రు,మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్,డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాలపై నిడమర్రు పరిధిలో పోలీస్ వారు 'విజిబుల్ పోలీసింగ్' వాహనతనిఖీలు నిర్వహించారు.నిడమర్రు ఇన్‌స్పెక్టర్ రజినీ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.ఎన్.వి.వి.రమేష్ సిబ్బంది ఆదివారం తనిఖీలు నిర్వహించారు.రికార్డులు లేని వాహనాలు,సరైన ధ్రువ పత్రాలు లేకుండా నడుపుతున్న 62 వాహనాలను గుర్తించి, చట్టపరంగా జరిమానాలు విధించారు.మద్యం మత్తులో డ్రైవింగ్ మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీల్లో ఒక లారీ, ఒక కారు, ఒక మినీ బస్సు ,5 మోటార్ సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు.రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ఏడుగురు వ్యక్తులపై న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ రాత్రి సమయాల్లో మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఘోర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటు వంటి వారిని ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మహిళలకు, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలిగించే వారిపై నిరంతరం డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పరిరక్షణ కోసం అసాంఘిక కార్యక్రమాలు నివారణ కొరకు నిడమర్రు వ్యాప్తంగా ఈ విజిబుల్ పోలీసింగ్ తనిఖీలు కొన సాగుతాయని ఎస్ఐ హెచ్చరించారు.

# రైతు నాయకుడు అప్పలరాజుపై పిడి చట్టం ఉపసంహరించాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు పై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పీడీ యాక్ట్ ను ఉపసంహరించాలని, అప్పలరాజును తక్షణమే జైలు నుండి విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రౌడీలు, గుండాలు, గంజాయి వ్యాపారులు, మానవ అక్రమ రవాణా చేసే అసాంఘిక శక్తులు, భూ కబ్జాదారులపై పెట్టాల్సిన పీడీ చట్టాన్ని భూముల రక్షణ కోసం, రైతులు, మత్స్యకారులు, ప్రజల హక్కుల కొరకు పోరాడే రైతు నాయకుడు అప్పలరాజుపై ప్రయోగించటాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ మాటకొస్తే పిడి చట్టాన్ని ముందుగా రాష్ట్ర ప్రభుత్వంపై పెట్టాలని అతిపెద్ద భూ కబ్జా దారు రాష్ట్ర ప్రభుత్వమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గంజాయి స్మగ్లర్లు, రౌడీలు, భూ కబ్జాదారులు రాష్ట్రంలో స్వేచ్ఛగా విహరిస్తున్నారని, ప్రజల పక్షాన పోరాడే నాయకులను మాత్రం జైలులో నిర్బంధించారని విమర్శించారు.

అప్పలరాజు పై పెట్టిన పీడీయాక్ట్ ను వెంటనే ఎత్తివేసి జైలు నుండి విడుదల చేయాలని కోరారు.ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు జి. రాంబాబు పాల్గొన్నారు.

# ఇనుమూరు గిరిజనులపై అక్రమ కేసులు ఆపాలి



**– నేడు జంగారెడ్డిగూడెంలో 30న ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గిరిజనులపై దాడులు, నిర్భంధాలు, అక్రమ పోలీసు కేసులు ఆపాలని,గిరిజన భూ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఆదివాసి గిరిజన, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు.

ఇనుమూరు గిరిజనులకు అండగా ఈనెల 29న జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం ముందు,30న ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది.శనివారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ అధ్యక్షతన ఇనుమూరు గిరిజనులకు న్యాయం కోసం ఆదివాసి గిరిజన, వ్యవసాయ కార్మిక,రైతు సంఘాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, సిపిఐ జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఎం సిపిఐ (యు) జిల్లా కార్యదర్శి శావనంపూడి నాగరాజు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకులు కట్టా సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు కారం భాస్కర్, ఇనుమూరు గిరిజన భూ బాధితులు పొట్టా రామదుర్గ, తెల్లం బాలాజీ, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్ మాట్లాడారు.

బుట్టాయిగూడెం మండలానికి చెందిన ఇనుమూరులో ఉన్న 57 గిరిజన కుటుంబాల వారు ఉన్నారని, వీరి జీవనాధరం వ్యవసాయమేనని చెప్పారు.ఇనుమూరు గిరిజనులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్,వామపక్షాలు, ఆదివాసి గిరిజన, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కాలుష్యరహిత పట్టణంగా తణుకు చేయడం కోసం కృషి



**తణుకు మేజర్ న్యూస్ :** తణుకు పట్టణాన్ని పరిశుభ్రంగా, కాలుష్యరహిత వాతావరణాన్ని సృష్టించడానికి తమవంతు కృషి చేస్తున్నామని బెల్వెథర్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ అద్దంకి దీపక్ కుమార్ తెలిపారు.ఆదివారం సజ్జాపురంలో అపరిశుభ్రంగా ఉన్న పార్కును తమ స్కూల్ విద్యార్థుల భాగ స్వామ్యంతో సుబ్రపరిచారు. దీనికి తమ విద్యార్థుల కొంతమంది తల్లిదండ్రుల ఆలోచన మరియు ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించి నట్లు చెప్పారు.దీనిని మరింత అభివృద్ధి చేయాలనే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రోత్సాహనికి అయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్య మైన విద్యార్థులకు అయన ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.

## రప్ప రప్ప బ్యాచ్‌ను బట్టలూడదీసి తన్నిస్తాం

**: ఆప్కాబ్ చైర్మన్ 'గన్ని' హెచ్చరిక**




**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** వైఎస్సార్సీపీ రప్ప రప్ప చేసిన బ్యాచ్ ను బట్టలు ఊడదీసి తన్నిస్తామని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెం పర్యటనకు ఆదివారం వచ్చిన గన్ని వీరాంజనేయులు మీడియాతో మాట్లాడుతూ మనం ఉన్నది ఉత్తర కొరియాల్లో కాదు ఆంధ్రప్రదేశ్ అన్నది కూడా ఈ శాడిస్టులకి అర్థం కావడం లేదని త్రీవంగా దుయ్యబట్టారు. ఇటువంటి వేషాలు వేసే వాళ్ళని రాబోయే రోజుల్లో కట్ డ్రాయర్లతో ఊరేగిస్తాం అని వార్నింగ్ ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లాలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నికి చెందిన అరాచకులకు పోలీసులు ఏ విధంగా బుద్ధి చెప్పారో గుర్తు చేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్,పట్టణ టిడిపి అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్,పరిమి సత్యనారాయణ,రావూరి కృష్ణ,మండవ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ 141వ వ్యవస్థాపక దినోత్సవం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా కమిటీ అధ్యక్షులు రాజ నాల రామ్మో హనరావు ఆధ్వర్యంలో భారత జాతీయ కాంగ్రెస్ 141వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో ప్రాణాలు అర్పించి జైలు శిక్షలు అనుభవించి,ఆస్తులు త్యాగం చేసిన కాంగ్రెస్ యోధులకు నమస్కారాలు తెలిపారు. ఈ నాటి దేశ పరిస్థితులపై,మత రాజకీయాలపై ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సమాజంలో జరుగుతున్నా వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాళ్లూరి చక్రవర్తి,కొమ్మన సాంబశివరావు, వెంకటరాజు, మూర్తి, తాడేపల్లి కుమార్,యవన నాగేంద్ర ,శ్రీనివాస్,దండుబోయిన చంద్రశేఖర్, బాబు ప్రసాద్,రాము, సేవాదళ్ సుబ్బారావు, కెఎస్ఎన్ మూర్తి, సేవాదళ్ సూర్యనారాయణ,నాగబాబు ,నజీర్ హుస్సేన్,కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు.

# మేదర కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి





**- ఆధునిక పరికరాలతో ఉపాధికి గండి**
**- షెడ్లు ,సరుకు కు సహకరించాలి**
**- గతంలో టిడిపి ప్రభుత్వంలో రుణాలు మంజూరు**

**చాట్రాయి,మేజర్ న్యూస్:** వెదురుతో అల్లికల ద్వారా ఉపాధి పొందే మేదర కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని చాట్రాయి మండలం మేదర సంఘం అధ్యక్షులు చీదిరాల రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. చాట్రాయి మండలంలో దాదాపు 150 కుటుంబాల వారు వెదురుతో తయారు చేయబడే వస్తువుల ద్వారా జీవనోపాధి పొందుతున్నట్లు ఆయన తెలిపారు. గతంలో పూర్వీకులు నేర్పిన అల్లికల ద్వారా నేటికీ అనేక కుటుంబాలు అదే వృత్తిని స్వీకరించి కుటుంబ పోషణ చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వెదురుతో తయారు చేయబడిన బుట్టలు, గంపలు అమ్మకాలు గతంలో బాగుండేవని తెలిపారు. సీజనల్గా సెప్టెంబర్ నుండి జనవరి సంక్రాంతి సమయం వరకు కోళ్ల పెంపకం దారులు పెద్ద స్థాయిలో గాబులు కొనుగోలు చేస్తారన్నారు, ఫిబ్రవరి నుంచి మే వరకు నూజివీడుకు పేరుగాంచిన మామిడి పళ్ళ కోసం వెదురు బుట్టలను వాడతారని రాంబాబు తెలిపారు. ప్రస్తుతం లారీ వెదురు కొనుగోలు చేయాలంటే రెండు లక్షల రూపాయలకు పైగా పెట్టుబడి అవుతుందని వ్యాపారం ఉన్నప్పటికీ పెట్టుబడి సొమ్ములు లేక కొందరు కూలీలుగా మారుతున్నారని పేర్కొన్నారు.

**- ఆధునిక పరికరాలతో ఉపాధికి గండి -**

ప్రస్తుతం ఆధునిక పరికరాలతో మేదర వస్తువులకు డిమాండ్ తగ్గటంతో ఉపాధికి గండి పడిందని పలువురు మేదర కులస్తులు పేర్కొన్నారు. ముఖ్యంగా కోళ్లు పెంచుకోవడానికి ఉపయోగించుకునే గాబుల స్థానంలో ఇనప గాబులు రావడం, మామిడి ,కూరగాయల ఎగుమతులు కోసం ఉపయోగించే గంపల స్థానంలో ట్రేలు రావడంతో తమ వ్యాపారాలకు కొంతమేర నష్టం వాటిల్లిందన్నారు. అయితే ప్లాస్టిక్ ట్రేలలో పండబెట్టిన పండ్లను తినటం ద్వారా అనారోగ్యాలు దరి చేరతాయనే నమ్మకంతో నేటికీ మామిడి, కూరగాయలను వెదురు బుట్టలలో నిల్వ ఉంచడానికి ఈ ప్రాంతవాసులు ఇష్టపడతారని తెలిపారు.

**- షెడ్లు ,సరుకు కొనుగోలుకు సహకరించాలి -**

ప్రభుత్వం వెదురు సరుకు కొనుగోలు చేసుకోవడానికి సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలంటున్నా రు. అలాగే కాలంతో సంబంధం లేకుండా వెదురు వస్తువులను తయారు చేసుకోవడానికి, తయారుచేసిన వస్తువులను అమ్మకాలు జరిపే వరకు దాచుకోవటానికి అనుకూలమైన షెడ్లు నిర్మాణం చేసుకోవటానికి అనుమతులు మంజూరు చేసి ఆదుకోవాలని పలువురు మేదర కులస్తులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు. అలాగే తయారుచేసిన వస్తువులను ప్రభుత్వంద్వారా కొనుగోలు చేసి ఎగుమతులు చేసిమనుగడ కోల్పోతున్న తమ వృత్తిని ఆదుకోవాలంటున్నారు.

**- గతంలో టీడీపీ ప్రభుత్వంలో రుణాలు మంజూరు -**

గతంలో టిడిపి ప్రభుత్వంలో మేదర కులస్తులకు రుణాలు మంజూరు చేయడం జరిగిందని తద్వారా చాలామంది ఉపాధి పొందారని మేదర సంఘ మండల అధ్యక్షులు రాంబాబు తెలిపారు. నేటికీ అనేకమంది యువకులు సైతంకులవృత్తినే నమ్ముకుని జీవనాధారం పొందుతున్నామని, పెట్టుబడులకు సొమ్ములు లేకపోవడంతో మహిళలు, యువకులు కూలి పనులకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. 35 సంవత్సరాల పైబడిన వారు నేటికీ బుట్టలు, గంపలు, గాబులు, విసనకర్రలు, చాటలు తయారీతోనే కుటుంబాలను పోషించుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా మేదర కులస్తులకు రుణాలు మంజూరు చేసి ప్రత్యక్షంగా పరోక్షంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని అధికారులను రాంబాబు కోరుతున్నట్లు తెలిపారు.

# నేడు అంబరు పేట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

**భీమడోలు,మేజర్ న్యూస్ :** ట్రాన్స్ కో భీమడోలు సెక్షన్‌కు చెందిన 33/11 కె.వి.సామర్ధ్యపు అంబరు పేట సబ్ స్టేషన్ పరిధిలో నూతన కండక్టర్లు( విద్యుత్ లైన్లు) వేయనున్న నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ట్రాన్స్ కో భీమడోలు సహాయ ఇంజనీర్ శివాజీ తెలిపారు. దీని కారణంగా11కె.వి. జి.కండ్రిక ఫీడర్ తో పాటు అంబరు పేట గ్రామపంచాయతీ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ,విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్య ద్వారానే ఆర్థిక స్వావలంబన





**- 100 కొండరెడ్డి కుటుంబాలకు రగ్గులు,స్టీలు కంచాలు,నోట్ బుక్స్ పంపిణీ**
**- సుస్మిత సంస్థల యజమాని సీలంశెట్టి కిషోర్**

**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** విద్య ద్వారానే గిరిజనులు ఆర్థిక స్వావలంబన పొందుతారని సుస్మిత సంస్థల యజమాని సీలంశెట్టి కిషోర్ తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామమైన గోగుమిల్లిలో కొండరెడ్డి గిరిజనులకు ఏలూరు కు చెందిన సుస్మిత సంస్థల అధినేత ప్రముఖ వ్యాపారవేత్త సీలంశెట్టి కిషోర్ సొంత నిధులతో ఏలూరు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో 100 కొండరెడ్డి కుటుంబాలకు ఇంటికి రెండు రగ్గులు,60 మందికి స్టీలు కంచాలు, విద్యార్థులకు నోట్ బుక్స్ లను ఆదివారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సుస్మిత సంస్థల అధినేత సీలంశెట్టి కిషోర్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ఉన్న విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తమ గ్రామంలో ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

మనం ఉన్నత స్థాయికి ఎగిరినప్పుడే మన కుటుంబాలను గ్రామాలను అభివృద్ధి చేసుకోగలమని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించి విద్య నేర్పించాలని తెలిపారు.

ఏలూరు లయన్స్ క్లబ్ సభ్యులు అడపా రాఘవ,ఏలూరుకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు తోట ఎడ్వర్డ్,శీలంశెట్టి కిషోర్ వారి సోదరులు సేలం శెట్టి రాజా మాట్లాడుతూ ఈ అటవీ ప్రాంత గ్రామాలలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని,ఆదివాసి గిరిజన ప్రజలు చలి బారిన పడకుండా రక్షించుకో వటానికి రగ్గులు పంపిణీ చేసినట్లు తెలియజేశారు.

పులిరామన్నగూడెం మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉద్దండం యేసు బాబు, గోగుమిల్లి గ్రామానికి చెందిన కేబాల్‌రెడ్డి ప్రసంగించారు. అనంతరం కొండ రెడ్డి బాలబాలికులకు చాక్లెట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు.

# కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలసిన స్వర్ణాంధ్ర విద్యార్థులు



**నరసాపురంరూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని సీతా రాంపురంలో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కలిశారు. ఆదివారం పీఎం లంకలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు మంత్రితో మాట్లాడారు. ప్రారంభించిననైపుణ్య శిక్షణ కోర్సుల కేంద్రం విద్యార్థుల పాలిట వరంగా మారిందని నిరుద్యోగ యువతని ఉద్యోగవం తులుగా తీర్చిదిద్దే దిశగా ఈకోర్సులు ఉన్నాయని విద్యార్థులు నిర్మలా సీతారామన్‌తో చెప్పారు. ఈ శిక్షణా కేంద్రంలో ఏఐ,రోబోటిక్స్, డిజిటల్ మార్కెటింగ్, డ్రోన్ టెక్నాలజీ ఇలా వివిధ ట్రెండింగ్ టెక్నాలజీలపై శిక్షణ ఇస్తున్నందుకు విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యాసంస్థల చైర్మన్ కెవి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి సూచనల మేరకు విద్యార్థులు కేంద్రమంత్రిని కలిసారు.

# అగ్ని ప్రమాద బాధితులకు అండగా వైసిపి నేత రఘురాం



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** తాడేపల్లిగూడెం మండలం, ఆరుగోలను గ్రామానికి చెందిన, 28సంవత్సరాల చిక్కాల వెంకట ధనలక్ష్మి,4 సంవత్సరాల చిన్నారి లహరి గ్యాస్ సిలిండర్ పేలుడు సంభవించడం వల్ల తీవ్రంగా గాయ పడ్డారు. గడిచిన మూడు రోజులుగా రాజమండ్రి శ్రీకర హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్‌ఆర్సిపి రాష్ట్ర రైతు విభాగం ఆక్వా కల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు రూ. 15వేలు ఆర్థిక సాయం అందించారు. మరింత వైద్య సహాయం కోసం తను మాత్రం ఆర్థికంగా సహాయం కావాల్సిన నేను అన్నివేళలా అందు బాటులో ఉంటానని వడ్డి ధైర్యం చెప్పారు.

# కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని ఆదుకోవడం హర్షణీయం

**- బయన్నగూడెంలో కళ్ళజోళ్ళ పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాలరాజు**



**కొయ్యలగూడెం రూరల్, మేజర్‌న్యూస్ :** పేద ప్రజలకు కంటి చూపు మెరుగునకు ఉచితంగా సొసైటీ ఆధ్వ ర్యంలో కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చడం అభినందించదగ్గ విషయమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు. బయన్నగూడెం వ్యవసాయ సహకార పరపతి సం ఘం అధ్యక్షులు మద్దు బాల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహి ంచిన కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈసందర్భంగా వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని సేవ కార్యక్రమాలతో వారిని ఆదుకోవడం ఎంతో సంతోషంగా ఉన్నదని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించే వారికి ప్రభుత్వము ఎల్లవేళలా సహాయ సహకారాలను అందజేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ బోరగం శ్రీనివాస్ ,జడ్పీ చైర్మన్ గంట పద్మశ్రీ ,గంగిరెడ్ల మేఘాల దేవి,పారేపల్లి రామారావు, సొసైటీ అధ్యక్షులు దుగ్గిన శ్రీను, పారిపల్లి నరేష్,బిజెపి జిల్లా సంయుక్త కార్యదర్శి మధు తేజ విశ్వనాథ్,బాలన్ నరేష్, బిజెపి నాయకులు గోలిశెట్టి వాసు, మాదేపల్లి శ్రీనివాస్, కుంతలగూడెం గ్రామ సర్పంచ్ పులి నాగరత్నం, గెడ ప్రకాష్, గెడ, అజిత్, బలుసు రా మ్మోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పోలవరం నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలుపుతా





**– కుంతలగూడెం పంచాయతీ కార్యాలయ శంఖుస్థాపనలో ఎమ్మెల్యే బాలరాజు**

**కొయ్యలగూడెం, మేజర్ న్యూస్** పోలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుతానని, గత ఏడాదిన్నర కాలంలో ఇప్పటివరకూ రూ.57కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చానని, ఎమ్మెల్యే చిర్రిబాలరాజు అన్నారు. ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కూడా ఈ నియోజకవర్గ అభివృద్ధికి ఏడాదిన్నర కాలంగా అత్యధికంగా రూ.50కోట్లు నిధులు ఇచ్చారని ఆయన చెప్పారు. మండలంలోని కుంతలగూడెంలో రూ.32 లక్షలతో నిర్మిస్తున్న పంచాయతీ భవనానికి ఆదివారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మజతో కలిసి ఆయన శంఖుస్థాపన చేశారు. కుంతలగూడెం గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. పంచాయతీ కార్యాలయానికి నిధులు మంజూరు చేయించడంతో పాటు, రూ.20లక్షలతో ఇప్పటి వరకూ సీసీరోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యాలయపు శంఖుస్థాపనతో పాటు జెడ్పీ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్, మరో రూ.5లక్షలతో నిర్మించిన తాగునీటి వాటర్ ట్యాంకును కూడా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్ ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ పులి నాగరత్నం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్ పర్సన్ ప్రసంగించారు. ఈ గ్రామానికి ఏ లోటు రానివ్వనని, అన్నీ ప్రభుత్వ శాఖల ద్వారా అందవలసిన అభివృద్ధి పథకాలను ఇక్కడ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ కుంతలగూడెం గ్రామానికి జిల్లా పరిషత్ నుంచి సిమెంట్ డ్రెయిన్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.20లక్షలు జెడ్పీ నిధులు మంజూరు చేసామని,మరో రూ.20 లక్షలు ఇప్పుడే మంజూరు చేస్తున్నాని సభాముఖంగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలో జిల్లాతో పాటు, పోలవరం నియోజకవర్గం కూడా ఎంతో అభివృద్ధి చెందిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.సీ మాజీ చైర్మన్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి రామారావు మాట్లాడుతూ వైసీపీ అనుసరిస్తున్న దౌర్జన్యకర విధానాలను దుయ్యబట్టారు. గోపాలపురం ఎ.ఎం.సీ మాజీ చైర్మన్ గెడ్ మురళీ అజిత్ కుమార్, కుంతలగూడెం గ్రామ నాయకుడు గెడా సూర్యప్రకాష్ తదితరులు ప్రసంగించారు. కొయ్యలగూడెం జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి, గవరవరం, కొయ్యలగూడెం పీఏసీఎస్ అధ్యక్షులు, యర్రంపేట గ్రామ సర్పంచ్, టీడీపీ మాజీ జెడ్పీటీసీ చింతల వెంకట రమణ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగిరెడ్ల మేఘలాదేవి, ప్రస్తుత జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఆకుల అరుణ, బీజేపీ, జనసేన మండలపార్టీ అధ్యక్షులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**– మా గ్రామాన్ని పొంగుటూరు పంచాయతీలో కలపాలి –**

కుంతలగూడెం రావడానికి ముందు ఎమ్మెల్యే ఆ మార్గంలోని కనకాద్రిపురం (ఆరిపాటిదిబ్బలు) కూడలిలో వాహనం దిగి అక్కడి నాయకులతో మాట్లాడారు.

పంచాయతీ కార్యాలయాన్ని కుంతలగూడెం లో నిర్మిస్తున్నందున ఆ పంచాయతీ పరిధిలోని కనకాద్రిపురంను కూడా అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అక్కడి వారికి నచ్చచెప్పడానికి ప్రయత్నించారు.

అయితే గ్రామస్థులు మా గ్రామంను కుంతలగూడెం పంచాయితీ నుంచి విభజించి పొంగుటూరు పంచాయతీలో కలపాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రజల కోరిక మేరకు గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటించారు.

# ఘనంగా సెయింట్ స్టెఫన్ లూథరన్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు



**పెనుమంత్ర,మేజర్‌న్యూస్ :** యూత్ ఆధ్వర్యంలో క్రిస్టమస్ వేడుకలు సెయింట్ స్టెఫన్ లూథరన్ చర్చ్ పెనుమంత్ర నందు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో పారిస్ పాస్టర్ రెవరెండ్ దాసి రాజారత్నం, సంఘ సిఆర్ దుండి నాగేశ్వరరావు, పాస్టర్ రెవరెండ్ దాయం జాన్సన్ దైవ వర్తమానికులు జి రాజాబాబు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి, పెనుమంత్ర గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక ప్రసన్నకుమార్ పాల్గొని యూత్ వారికి శుభాశీస్సులు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చలమల దుర్గ, నాయకులు నరాల శెట్టి వెంకటేశ్వర రావు, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియపరిచారు, యూత్ వారి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది.

# సొసైటీల ద్వారా రైతాంగానికి పూర్తి సహకారం





**– అప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు,ఎమ్మెల్యే రోషన్ కుమార్**

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** రాష్ట్ర లోని ప్రతీ రైతుకు సొసైటీల ద్వారా పూర్తి సహకారం అందించటం జరుగుతుందని రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. జంగారెడ్డిగూడెం ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆదివారం ఆవిర్భావ దినోత్సవ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంకు రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు రుణాలు,వ్యవసాయ పని ముట్లు,ఎరువులు,సబ్సిడీ మీద అందిస్తున్నారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం సొసైటీ వంద సంవత్సరాల కార్యక్రమంలో పాల్గొనటం అనందగా ఉందని,సొసైటీ అభివృద్ధి కి సహకరిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ ప్రెసిడెంట్ మానికల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సొసైటీ డైరెక్టర్లు పాతూరి అంబేద్కర్, కొంబాడ దుర్గా వరప్రసాద్ సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యదర్శి బోడా ఆనంద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 150 మంది పేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**– మానవత సేవలు అభినందనీయం**

**: జనసేన నేత వట్టి పవన్**



**భీమడోలు,మేజర్ న్యూస్ :** వివిధ రూపాలలో ఇబ్బందులు పడుతున్న వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్న స్వచ్ఛంద సంస్థ మానవత,భీమడోలు శాఖ చేస్తున్న కృషి అభినందనీయమని జనసేన పార్టీ నాయకులు వట్టి పవన్ కుమార్ అన్నారు. పూళ్ళ గ్రామపంచాయతీ పరిధిలోని ఎం.ఎం.పురం ఆవాస ప్రాంతంలో మానవత శాఖ 150 మంది నిరుపేద వృద్ధులకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వట్టి పవన కుమార్ మానవత భీమడోలు శాఖ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా పనిచేసిన వట్టి వీర వెంకట సత్యనారాయణ 102 వ జయంతి పురస్కరించుకొని,ఆయన కుటుంబీకులు,మానవత అభివృద్ధి కమిటీ సభ్యులు వట్టి సుగుణాకర్ ఆయన జ్ఞాపకార్థం నిరుపేదలలో పురుషులకు టవల్స్,మంకీ క్యాప్‌లు,మహిళలకు టవల్స్,స్కాపులను అతిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కార్యవర్గ సభ్యులు రామిశెట్టి గంగాధర రావు,ఉమామహేశ్వర రావు, మండల శాఖ నాయకులు సాంబశివరావు, పంచకర్ల సత్యనారాయణ, రమణ శంకర్, మండే సుధాకర్ పాల్గొన్నారు.

## నేడు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం :

**తహసిల్దార్ రమాదేవి**



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** భీమడోలు తహసిల్దార్ కార్యాలయం వేదికగా ఈనెల 29వ తేదీ సోమవారం రెవెన్యూ క్లినిక్ కార్య క్రమాన్ని నిర్వహించనున్నట్లు, తహసిల్దార్ బి.రమాదేవి తెలిపారు. మండల పరిధిలో భూములు గల రైతుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనిలో ఆర్ఓఆర్ సంబంధిత సమస్యలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, డి-ఫారం పట్టాలు,అడంగల్ సవరణలు, అక్రమ ఆక్రమణలు, మ్యూటేషన్, కొలరేషన్ జాయింట్ ఎల్పియం, ఎఫ్ లైన్, రీ సర్వే వ్యత్యాసాలు, ఆర్ ఓ ఆర్ అప్పీళు ,, 22 -ఎ ఇతర రెవెన్యూ ,సర్వే సమస్యలు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో వాటిపై విచారణ జరిపి సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని తహసిల్దార్ వివరించారు. రైతులు కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పీఎం లంకలో కేంద్రమంత్రికి ఘన స్వాగతం



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని, పెదమైన వాని లంక సముద్రం తీరమున ఉన్న శివాలయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం విప్ నాయకర్ బండి ముత్యాలమ్మ అమ్మవారి చిత్రపటాన్ని మంత్రి అందజేశారు.

# మూడవరోజు ఘనంగా జాతీయ స్థాయి నృత్యోత్సవాలు,నృత్య పోటీలు






**ఏలూరు,మేజర్ న్యూస్ :** వై. ఏం. హెచ్. ఏ హాల్ నందు రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న అభినయ నృత్యభారతి 30వ జాతీయ స్థాయి నృత్యోత్సవాలు, నృత్య పోటీలు మూడవరోజు ఆదివారం ఉదయం నుండి కూచిపూడి, జానపద సీనియర్స్ కేటగిరి,బృంద నృత్యపోటీలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ పోటీలలో చివరి రోజు 150మంది చిన్నారి,యువ నర్తకులు పాల్గొని వారి ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు, విజేతలకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించారు.సాయంత్రం 5.30గంటల నుండి 7.30గంటల వరకు జాతీయ స్థాయి శాస్త్రీయ యువ నృత్యోత్సవాలు నిర్వహించారు. లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్.వి.వి. ఎస్.పాపారావు నాయుడు నృత్యోత్సవాలను ప్రారంభిస్తూ భవిష్యత్తులో నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్ ద్వారా జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో లయన్స్ ఆధ్వర్యంలో యూత్ ఎక్స్చేంజి ప్రోగ్రామ్స్ నిర్వహిస్తామని తెలిపారు.విశాఖపట్నంకు చెందిన కుమారి గాయత్రి కూచిపూడి నృత్యం,ఒరిస్సా బరంపురం నకు చెందిన కుమారి తులిక రెడ్డి ఒడిసి నృత్యం,చెన్నైకు చెందిన డి.చక్రవర్తి కూచిపూడి నృత్యం,కరీంనగర్‌కు చెందిన టి.సంతోష్ పేరిణి శివతాండవం,సామర్లకోటకు చెందిన చక్రవర్తుల పవన్ కుమార్ కూచిపూడి నృత్యం,వరంగల్లుకు చెందిన కుమారి బి.వైష్ణవి పేరిని లాస్యం,కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత కాకినాడకు చెందిన బి. మల్లిఖార్జునరావు ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేసాయి. వీరందరికి సంస్థ తరపున నృత్య కౌముది అవార్డులు అందించారు. ప్రఖ్యాత కూచిపూడి నృత్య గురువు యక్షగాన ఖంటీరవ డా.పసుమర్తి శేషుబాబుకి భరత కళాప్రపూర్ణ కోరాడ నరసింహారావు మెమోరియల్ నృత్య రంగ సేవాతపస్వి అవార్డుతో సత్కరించారు. అనంతరం జరిగిన అవార్డులు, బహుమతి ప్రదానోత్సవ సభకు ఆర్.టి.సి విజయవాడ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు,లయన్స్ పూర్వపు గవర్నర్లు దామెర రంగారావు,వేమా కోటేశ్వరరావు ఉత్సవాల ఆహ్వాన సంఘం కార్యదర్శులు లేళ్ల వెంకటేశ్వరరావు,దువ్వి రామారావు సంస్థ ప్రతినిధులు డా. ముసునూరి వెంకట ప్రసాద్,యర్రా హరనాథ్,కానాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విద్యా రంగానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత




**– ఎపిఎస్‌టిఎ రాష్ట్ర క్యాలెండర్,**
**జిల్లా స్టిక్కర్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతమనేని**

**పెదవేగి,మేజర్ న్యూస్ :** దుగ్గిరాలలోని క్యాంప్ ఆఫీస్ నందు ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను చ్రింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తుందని, మెగాడీఎస్సీ ద్వారా సుమారు 16 వేల పోస్టులు అధికారంలోకి వచ్చిన వెంటనే పారదర్శకంగాభర్తీ చేసిందని, ఉపాధ్యాయ ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్స్, అంతర్ జిల్లా బదిలీలు అన్నీ కూడా పారదర్శకంగా చేశామని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి నేటి వరకు సుమారు రెండు లక్షల ఉపాధ్యాయ పోస్టులు ద్వారా భర్తీ చేసిన ఘనత ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడుకి చెందుతుందని తెలియజేశారు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.జే.ఏ. స్టీవెన్ మాట్లాడుతు ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 500 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చి, వారికి ఉచితంగా మెటీరియల్ ఇచ్చి,120 రోజులు ఉచిత భోజనం స్నాక్స్ టీలు అందజేసి 38 మంది ఉపాధ్యాయులు ఈ కోచింగ్ ద్వారా ఎంపిక అవటం వారి జీవితాల్లో వెలుగులు నింపిన చింతమనేని ప్రభాకర్‌కి ఎపిఎస్‌టిఎ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌టిఎ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోట ప్రసాద్, గౌరవాధ్యక్షులు పిట్ట పెట్రిక్ బాబు,కోశాధికారి ఊర్ల గంధర్వరావు, గౌరవ సలహాదారు గోరింక గంగరాజు,సీనియర్ ఉపాధ్యాయులు పిఎస్‌చహె చ్‌ఎం శరత్,ఉపాధ్యాయులు ఎ.సురేష్ కుమార్,ప్రసన్నకుమార్ రాటాలు, అంజిబాబు, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసి ప్రాంతాలను చేర్చాలి

**– ప్రభుత్వం శాస్త్రీయంగా ఆలోచించాలి : సిపిఎం**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసి ప్రాంతాల్లో చేర్చాలని, కూటమి ప్రభుత్వం శాస్త్రీయంగా ఆలోచించాలని, ప్రజాభిప్రాయానికి విలువని వ్వాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో చేసిన రెండో ప్రకటన ఏజెన్సీ ప్రాంత ప్రజలను నిరుత్సాహానికి గురిచేసిందని అన్నారు. జిల్లాలోని పోలవరం ఆదివాసీ ప్రాంతాలను పోలవరం జిల్లాలో కలపాలని చెప్పి కొంతకాలంగా ఆ ప్రాంత ఆదివాసీలు,ప్రజా సంఘాలు, ప్రజానీకం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారని తెలిపారు.

పూర్తిగా అశాస్త్రీయమైనదని,పోలవరం జిల్లాలో పోలవరం లేకపోవడం చాలా హాస్యాస్పదంగా ఉందని, ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన ఎద్దేవ చేశారు.ఏ శాస్త్రీయత లేకుండా ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేయడమేమిటని ప్రజలు అడుగుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ నాయకులతో పాటు చాలామంది ఈరోజుకి కూడా పోలవరం జిల్లాలో పోలవరం ఉందనే భ్రమలో ఉన్నారని, పోలవరం జిల్లాలో పోలవరం లేదని తెలిసి ఆశ్చర్యానికి గురవుతున్నారని తెలిపారు.

ఇప్పుడు రెండవ ప్రకటనలో ప్రభుత్వం ప్రజల అభిప్రాయ సేకరణకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేస్తున్నామని చెబుతున్నా అది కూడా ప్రజల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చేస్తున్నారని అన్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగాను జిల్లాల పునర్విభజన చేయాలని, పోలవరం జిల్లాలో పోలవరం ఆదివాసి ప్రాంతాలను కలపాలని ఏ.రవి డిమాండ్ చేశారు.

## 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** వెనుక బడిన తరగతులు సంక్షేమ శాఖ జిల్లా నందు 10వ తరగతి విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం పెంచుటకు నైపుణ్యము కలిగిన ఉపాధ్యాయులతో ప్రేరణ,శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా వెనుక బడిన తరగతులు, సాధికారత అధికారి ఆర్ నాగరాణివసతిగృహ సంక్షేమ అధికారులు హాజంయ్యారు.

# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**– మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు విస్తరణ**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో డిసెంబర్, 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా పిజి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి గారు సోమవారం ద్వారకా తిరుమల వెళ్లనున్న దృష్ట్యా పిజిఆర్ఎస్ కార్యక్రమానికి హాజరు కాలేరని, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, వివిధ శాఖల ప్రధాన అధికారులు పిజిఆర్ఎస్ కు హాజరవుతారన్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను సోమవారం 29న మండల, డివిజనల్ ,మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది.దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చున్నారు. అలాగే, ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: ?? %ట్ప్రజూం://ఎవవనిశీయిఎ.ఖజూ.న్రశీజ.ఱఅ %ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే, 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు.ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయా నుకూలంగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

# ఇక నుండి రెవెన్యూ సమస్యలకు వేగవంతమైన పరిష్కారం

**– పీజిఆర్ఎస్‌తో పాటు సమాంతరంగా**
**రెవెన్యూ సమస్యలపై క్లినిక్‌ల నిర్వహణ**



**భీమవరం,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని,దీని ద్వారా జిల్లాలో రెవెన్యూ సమస్యలు వేగవంతమైన పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి సోమ వారం పి జి ఆర్ ఎస్‌కు సమాంతరంగా ప్రతి రెవెన్యూ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరి ంచడం జరుగుతుందని,అర్జీ పరిశీలించిన వెంటనే సంబంధిత రెవెన్యూ అధికారితో మాట్లాడి వెంటనే పరిష్కరించ డానికి కృషి చేస్తామన్నారు. తక్షణ పరిష్కారానికి ఆస్కారం లేని వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుం దన్నారు. ప్రజలు ఆర్ఓఆర్‌కు సంబంధించిన సమస్యలు, పట్టాదారు పాస్ బుక్‌లు,ఆర్ ఓఎఫ్ ఆర్, రెగ్యులేషన్ ఆఫ్ 1/70, రీ సర్వే,అడం గల్, వెబ్ ల్యాండ్, ఎఫ్ లైన్ పిటిషన్,తదితర అంశాలపై సమస్య లు ఉంటే అర్జీలను సమర్పించి సమస్యలను పరిష్కరి ంచుకోవచ్చని స్పష్టం చేశారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు.

# ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు సంఘటితంగా ముందుకు సాగాలి



– ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు
– ముస్లిం నూర్ భాష,దూదేకుల సంక్షేమ సంఘం
జిల్లా కార్యవర్గ ప్రమాణం

**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్ :** ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కులాల వారు సంఘటితంగా ముందుకు సాగాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సూచించారు. ఆదివారం ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముస్లిం నూర్ భాష, దూదేకుల సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ వెనుకబడిన కులాల వారు కడుపు కాల్చుకుని అయినా సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ముస్లిం దూదేకుల నూర్ భాషా కులస్తులకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మరెక్కడ లేనివిధంగా ఐదువేల మందితో ఇఫ్తార్ విందు ఇచ్చిన ఘనత గోపాలపురం నియోజక వర్గానికి దక్కుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ సిద్ధమేనని ఎమ్మెల్యే వెంకట్రాజు పేర్కొన్నారు.జిల్లా అధ్యక్షులుగా షేక్ ఇబ్రహీం, కార్యదర్శిగా షేక్ బాబు కాలిశా, కోశాధికారిగా మహమ్మద్ మౌలా, జిల్లా యూత్ అధ్యక్షులుగా మహమ్మద్ రఫీ, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా షేక్ సతార్ బి,ప్రధాన కార్యదర్శిగా షేక్ నాగూర్ బీబీ లతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యేతో పాటు పలువురు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ముస్లిం నూర్ భాష దూదేకుల సంఘ చైర్మన్ నాగుల్ మీరా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయటంతో పాటు 100 కోట్ల రూపాయలు కార్పొరేషన్ కు ప్రకటించిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం నూర్ భాషా కులస్తులకు అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కే పీర్ మహమ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సుభాన్, ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ షేక్ ఇస్మాయిల్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మేరా సాహెబ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డి మస్తానమ్మ పలు జిల్లాల నుంచి వచ్చిన కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో యువకులు,మహిళలు, మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# నేడు భీమవరం వన్ టౌన్ పిఎస్‌లో పోలీసుల పిజిఆర్ఎస్

**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా పోలీసు యంత్రాంగం ప్రతి సోమవారం నిర్వహించే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీకోసం) కార్యక్రమ వేదికలో తాత్కాలిక మార్పు జరిగింది. ఈ నెల డిసెంబర్ ఈ నెల 29న సోమవారం నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని గొల్లలకోడేరులోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి బదులుగా,భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించనున్నారు. గొల్లలకోడేరులోని ప్రధాన కార్యాలయానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్న కారణంగా, ఫిర్యాదుదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈ తాత్కాలిక ఏర్పాట్లు చేయడం జరిగింది. కావున, తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు ఈ వేదిక మార్పును గమనించి, సోమవారం ఉదయం భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవాలని జిల్లా పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

# నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆపన్నహస్తం



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** నగరంలోని నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు, ఆపన్నహస్తం అందిస్తూ నిస్వార్థంగా సేవలు అందిస్తున్నామని ఫౌండేషన్ అధినేత ప్రశాంత్ తెలిపారు. ఫౌండేషన్ ఏర్పడి ఎనిమిదో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం నగరంలోని లయన్స్ క్లబ్ హాలులో ఘనంగా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నిస్వార్థ ఫౌండేషన్ ద్వారా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులను సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ అధినేత ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగులు,రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులు,అలాగే వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు తమ వంతుగా సహాయం అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సభ్యులు బాలాజీ, కేశవ్, నరేష్, మహేష్, రవీంద్ర, బాలు, లావణ్య, సౌజన్య, జ్యోతి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేనలో చేరిన వైసిపి నాయకులు



**మంగళగిరి/ఏలూరు,మేజర్ న్యూస్ :** గుంటూరు జిల్లాలోని మంగళగిరి సి.కె. కన్వెన్షన్ లో ఆదివారం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబు, జనసేన పి.ఎ.సి. సభ్యులు,ఎమ్మెల్యే పిడుగు హరి ప్రసాద్ సమక్షంలో పలువురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వైసిపి నుంచి జనసేన పార్టీలో చేరారు.వారిలో టీ.నర్సాపురం మండలం నుంచి కొంతమంది నాయకులు వంటిపల్లి వెంకటేశ్వరావు, కన్నం సర్వేశ్వరరావు,వంటిపల్లి సోమేశ్వరరావు,గుడిసె శ్రీనివాసరావు నార్లపాటి రామకృష్ణ బచ్చు కోటేశ్వరావు బొడ్డపాటి గంగాధరావు,భూక్యా వేణు గోపాల్ కుంజా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

– పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు బాగున్నాయి – ఈ సందర్భంగా వంటిపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు బాగున్నాయని అన్నారు. ఆయన సిద్ధాంతాలకి,ఆయన చేసే పనులకు ఆకర్షితులై ఈ పార్టీలో చేరానని అన్నారు. త్వరలో ఇంకా మండలం నుంచి చాలామంది పార్టీలో చేరుతున్నారని వివరించారు.

# ఘనంగా టిడిపి సీనియర్ నేత 'కాపా' జన్మదిన వేడుకలు



**నూజివీడు, మేజర్ న్యూస్:** నూజివీడు నియో జకవర్గ తెలుగు దేశం పార్టీ నాయ కులు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రావిచెర్ల గ్రామ సర్పంచ్ కాపా శ్రీనివాసరావు జన్మదిన వేడు కలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముందుగా రావిచెర్ల గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో కాపా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం నాయకులు కాపా శ్రీనివాసరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నూజివీడు నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కేకులు కట్ చేసి మిఠాయిలు పంచి శు భాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో కాపా కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు ఏలూరు మండల రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ఏలూరు మండల రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఏలూరు తహశీల్దార్ గాయత్రి ఒక ప్రకటనలో తెలిపారు.ఏలూరు పట్టణం,ఏడు గ్రామాలకు సంబంధించిన సంబంధిత ప్రజలు తమ సమస్యలను కాగితంపై లిఖితపూర్వకంగా ఏలూరు అర్బన్ మండలం, కోటదిబ్బ తహశీల్దార్ కార్యాలయంలోనితహశీల్దార్‌కు సమర్పించాలన్నారు. తదుపరి సదరు సమస్యలను పరిశీలించి, నియమ నిబంధనల ఆధారంగా వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని, .కావున ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవలసి నదిగా గాయత్రి విజ్ఞప్తి చేశారు.

# నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

– మండల కేంద్రాలు,
మున్సిపాలిటీల్లోనూ అర్జీల స్వీకరణ
– 1100 కాల్ సెంటర్, ఆన్‌లైన్ సేవలను
వినియోగించుకోవాలి



**భీమవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.అర్జీదారులు తమసమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అర్జీని సమర్పించాలన్నారు. సోమవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మున్సిపల్/మండల స్థాయిలో జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోకూడాపిజీఆర్ఎస్ జరుగుతుం దని, ప్రజలు తమ సమీప కేంద్రాల్లో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.మీకోసం' 1100 కాల్ సెంటర్: అర్జీదారులు కలెక్టరేట్‌కు రాకుండానే తమ సమస్యలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన 1100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించ వచ్చునని కలెక్టర్ సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీల స్టేటస్ తెలుసుకోవడానికి కూడా ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చు. అలాగే, meekosam .ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా అర్జీలను సమర్పించ వచ్చునని సూచించారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు సత్వర పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# రంగినీడి గంగాధర్‌ను పరామర్శించిన తెదేపా నాయకులు

**పెరవలి,మేజర్‌న్యూస్ :** అన్నవరప్పాడు గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రంగినీడి గంగాధర్ కుమారుడు ఇటీవల కాలం చేసిన సంగతి తెలుసుకున్న పెరవలి మండల తెదేపా నాయకులు డిసెంబర్ 28వ తేదీ ఆదివారం అన్నవరప్పాడు గ్రామానికి వెళ్లి రంగినీడి గంగాధర్ ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ సోదరుడు అన్నవరప్పాడు గ్రామ ఎక్స్ ఎంపిటిసి తెదేపా నాయకులు రంగినీడి కట్లయ్యతో పాటుహనుమంతు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# పిఎం లంకలో ఎఐ ఆధారిత నైపుణ్య కేంద్రం





**– జీవనోపాధి మార్గాలతో యువత,మహిళల సాధికారతకు శ్రీకారం**
**– కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్**

**నరసాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** మండలంలోని పెదమైనవానిలంక డిజిటల్ భవన్‌లో 'సైయెంట్ ఏ ఐ అండ్ ఫ్యూచర్ స్కిల్స్‌హబ్'ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర జలవనులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బివిఆర్ మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, పితాని సత్యనారాయణ, ఆరుమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్,ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడుతూ సైయెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీనిని మోడల్ఏ ఐ-ఆధారిత గ్రామీణ నైపుణ్య, జీవనోపాధి కేంద్రంగా మార్చే లక్ష్యంతో నెలకొల్పడం జరిగిందన్నారు. సైయెంట్ ఏ ఐ అండ్ ఫ్యూచర్ స్కిల్స్ హబ్ ద్వారా యువత,మహిళలు, రైతులు, స్వయం సహాయక బృందాలు, స్థానికులకు జీవనోపాధి అవకాశాలకు అనుగుణంగా భవిష్యత్తు –సిద్ధమైన నైపుణ్యాలను అందించడం ద్వారా సాధికారతను అందిస్తుందన్నారు. ఈ కేంద్రంలో ఏఐ ఆధారిత వ్యవస్థలు, స్మార్ట్ తరగతి గదులు, 40-సిస్టమ్ కంప్యూటర్ ల్యాబ్, డ్రోన్ శిక్షణ పరికరాలు, హై-స్పీడ్ కనెక్టివిటీ, లైసెన్స్ పొందిన ఓపెన్-సోర్స్ ఏ ఐ సాధనాలు నిర్మాణాత్మక శిక్షణ డెలివరీ, రియల్-టైమ్ ట్రాకింగ్ ఫలిత కొలతను ప్రారంభించే కేంద్రీకృత అభ్యాస నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వయం ఉపాధికి అవకాశంగా ఉంటుందన్నారు. సైయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బివిఆర్ మోహన్ రెడ్డి కేంద్ర,రాష్ట్ర మంత్రులు,శాసనసభ్యులు, సైయెంట్ ఫౌండేషన్ ప్రతినిధులు,అధికారులు,ప్రజలు,విద్యార్థులు,కూటమి నాయకులు,స్థానిక ప్రజాప్రతి నిధులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



**పోడూరు,మేజర్ న్యూస్:** పోడూరు మండలం కవిటం గ్రామంలో నూత నంగా నిర్మిస్తున్న శ్రీ పార్వతీ సమేత ఉమా మహేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాత శివాలయంలో ప్రత్యేక పూజలు పాల్గొని,వేద పండితుల ఆశీర్వచనాలను అందుకు న్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కుభారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ త్రినాథ రావు, జిల్లా దేవాదాయ శాఖ అధికారి హరి సూర్య ప్రకాష్, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కళలను ప్రోత్సహిస్తున్న ప్రధాని మోడీ



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** మన్ కి బాత్ (మనసులోని మాట) ద్వారా దేశం మారుమూలల్లో ఉన్న కళా సాంస్కృతిక, క్రీడా,శాస్త్ర సాంకేతిక రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని బిజెపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ బాధ్యులు ఈతకోట భీమశంకరరావు( తాతాజీ) కొనియాడారు. ఎంతో మందికి ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, వారి ఉత్పత్తులకు గుర్తింపు లభిస్తుంది అన్నారు. ఓబిసి మోర్చ కాకినాడ జోనల్ ఇన్చార్జి బాలకృష్ణ మాట్లాడుతూ మన్ కి బాత్ కార్యక్రమం వేదికగా దేశంలోని మారుమూల ప్రాంతాలలో సైతం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సామాజిక కార్యకర్తలు, కళా సాంస్కృతిక, వ్యవసాయ, పారిశ్రామిక శాస్త్ర సాంకేతిక రంగాల వారిని గుర్తించి వారి వివరాలను సేకరించి వారి ప్రతిభను వెలికి తీసి చేయూతనిస్తున్న ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు. జిల్లా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎక్కడో మారుమూల ఉన్న ప్రతిభ సృజనాత్మకత కలిగిన వివిధ రంగాల వారికి ఈ కార్యక్రమం ద్వారా మంచి గుర్తింపు ప్రోత్సాహం ప్రభుత్వ సహకారం లభిస్తున్నాయని కొనియాడారు. 21వ వార్డు 116,121,122 పోలింగ్ బూత్ లకు సంబంధించి మన్ కి బాత్ ప్రసారం మహా గాంధీ శక్తి కేంద్రంలో జరిగింది.

## 30న పారిజాత గిరిలో ముక్కోటి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస కార్యక్రమాలలో భాగంగా ఈనెల 30వ తేదీ మంగళవారం తెల్లవారుజామున 5 గంటల 15 నిమిషాలకు విశేష అలంకరణతో ఉత్తర ద్వారా దర్శనం కార్యక్రమం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు విశేష వస్త్ర వితరణ,అన్న ప్రసాద వితరణ, గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు తగిన సౌకర్యాలు సమకూరుస్తున్నామని తెలిపారు. భక్తులు వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు ఉత్తర ద్వారా దర్శనంలో స్వామివారిని దర్శించుకుని అనుగ్రహంనకు పాత్రులు కావాలని తెలిపారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న గన్ని,సొంగా రోషన్ కుమార్



**జంగారెడ్డిగూడెం, మేజర్ న్యూస్ :** టిడిపి సీనియర్ నాయకులు పెనుమర్తి రామ కుమార్ ఇంటి వద్ద ఆదివారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తో కలిసి రాష్ట్ర అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్,జిల్లా ఉపాధ్యక్షులు రావూరికృష్ణ,టిడిపి సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు ,పరిమి సత్తిపండు, నంబూరి రామచంద్రరాజు,చిట్టిబోయిన రామలింగే శ్వరరావు, షేక్ ముస్తఫా,మద్దిపాటి నాగేశ్వరరావు, మారిశెట్టి సత్యనారాయణ, కోనేటి చంటి, కంపా రాజేంద్ర,గుమ్మడి ప్రసాద్, షేక్ యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ సిఐటియు బహిరంగ సభకు తరలి రండి



**ఉండి,మేజర్ న్యూస్:** విశాఖలో జనవరి 4వ తేదీన జరిగే బహిరంగ సభకు తరలి రావాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు మండల కన్వీనర్ ధనికొండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా వచ్చేనెల 4న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో బైక్,ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో జరుగనున్న అఖిలభారత సిఐటియు మహాసభల్లో కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించి భవిష్యత్తులో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు సిఐటియు పోరాటం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కో కన్వీనర్ కొట్టాడ వెంకటేశ్వరరావు జిల్లా కమిటీ సభ్యులు వీరవల్లి మాధవరావు మండల నాయకులు రామకూరి వెంకటరత్నం, పెల్లూరి సుబ్రహ్మణ్యం, ఇర్రింకి శ్రీరామ్మూర్తి, మంగం శ్రీనివాస్, కుక్కల లోకేష్, కొట్టాడ భాను తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



డిప్యూటీ స్పీకర్ రఘురామ

**ఉండి,మేజర్‌న్యూస్:** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్‌రాజు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ 2025 ద్వారా ఉపాధ్యాయునిగా అర్హత పొందిన 15 మంది ఉపాధ్యాయులకు ఏలూరు జిల్లాలోజాయినింగ్ఆర్డర్ ఇవ్వకపోవడంతో వారు సమస్యను పిఎస్ఎన్ రాజు సహకారంతో డిప్యూటీ స్పీకర్,ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించి 15 మంది ఉపాధ్యాయులకు జాయినింగ్ ఆర్డర్ ఇచ్చారన్నారు. తమకు జాయినింగ్ ఆర్డర్లు ఇప్పించడానికి కృషి చేసిన ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు,ఎన్‌టిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్ఎన్ రాజు లను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రఘురామకృష్ణం రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు ఉపాధ్యాయుల సమస్యను తన దృష్టికి తీసుకు వచ్చిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ను ఆయన అభినందించారు.